క్లుప్తంగా

'గోవుల సంరక్షణకు చర్యలు చేపట్టాలి'



ఏఎస్పీకి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

భైంసాటౌన్‌: గోవుల సంరక్షణకు చర్యలు తీసుకోవాలని బీజేపీ నాయకులు కోరారు. ఈ మేరకు ఆ పార్టీ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం ఏఎస్పీ కాంతిలాల్‌పాటిల్‌ను వారి కార్యాలయంలో కలిసి విన్నవించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షురాలు రమాదేవి, పట్టణాధ్యక్షులు మల్లేశ్వర్, బాలాజీ, సాహెబ్‌రావు, రమేశ్, సంపత్‌పటేల్, అక్షయ్‌ పటేల్‌ తదితరులు పాల్గొన్నారు.

'ప్రైవేట్‌ పాఠశాలలపై చర్యలు తీసుకోండి'

భైంసాటౌన్‌: నిబంధనలకు విరుద్ధంగా పాఠ్య పుస్తకాలు విక్రయిస్తున్న ప్రైవేట్‌ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఎస్‌ఎస్‌యూఐ నాయకులు డిమాండ్‌ చేశారు. ఈ మేరకు మంగళవారం పట్టణంలోని ఎమ్మార్సీ కార్యాలయంలో వినతిపత్రం అందించారు. అధిక ఫీజులు వసూలు చేస్తూ, కనీస వసతులు కల్పించకుండా నిర్వహిస్తున్న విద్యాసంస్థలపై కఠినంగా వ్యవహరించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా బాధ్యులు అంజాద్‌ షేక్, భూషన్, రాంనాథ్‌ ఉన్నారు.

కరెంట్‌షాక్‌తో గేదె మృతి

లోకేశ్వరం: మండలంలోని నగర్‌ గ్రామంలో రాందాస్‌ అనే రైతుకు చెందిన గేదె మంగళవారం కరెంట్‌ షాక్‌తో మృతి చెందింది. వివరాల్లోకి వెళితే.. రాందాస్‌ తన గేదెను రోజు మాదిగానే మేపేందుకు శివారు ప్రాంతంలోకి తోలుకెళ్లాడు. అక్కడ మోటార్‌ విద్యుత్‌ సర్వీస్‌ వైరు తెగిపోయి ఇనుప కంచెపై పడింది. గేదె మేస్తూ వెళ్లి విద్యుత్‌ సరఫరా అవుతున్న ఇనుప కంచెను తగలడంతో అక్కడికక్కడే మృతి చెందింది. గేదె విలువ రూ.70 వేలు ఉంటుందని.. ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు వేడుకున్నాడు.

ముగ్గురి బైండోవర్‌

మామడ: మండలంలోని జగదాంబతండాలో గుడుంబా తయారీ, విక్రయిస్తూ పట్టుబడిన ముగ్గురిని మంగళవారం తహసీల్దార్‌ ఆరిఫా ఎదుట బైండోవర్‌ చేసినట్లు ఎక్సైజ్‌ ఎస్సై రవికుమార్‌ తెలిపారు. నాటుసారా తయారు చేసినా.. విక్రయించినా కేసులు నమోదు చేస్తామని ఎస్సై హెచ్చరించారు.

అపరిచితులకు బ్యాంకు వివరాలు చెప్పొద్దు

సోన్‌: అపరిచితులు ఫోన్‌ చేసి బ్యాంకు వివరాలు, ఓటీపీలు అడిగితే చెప్పవద్దని ఏఎస్సై ధల్లుసింగ్‌ అన్నారు. మంగళవారం మండలంలోని న్యూవెల్మల్‌ గ్రామంలో ఆన్‌లైన్‌ మోసాల బారిన పడకుండా ప్రజలకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ గుర్తు తెలియని వ్యక్తులు ఫోన్‌ చేసి లాటరీ వచ్చిందని ఏటీఎం, బ్యాంకు వివరాలు అడిగితే పోలీసులకు సమాచారం ఇవ్వాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో పోలీసులు రామకృష్ణ, శేఖర్‌ తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీ తనిఖీ

దస్తురాబాద్‌: మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని మంగళవారం తహసీల్దార్‌ లక్ష్మి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కళాశాలలో విద్యార్థుల హాజరు, అడ్మిషన్ల వివరాలు అడిగి తెలుసుకున్నారు. వర్షాకాలంలో విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలన్నారు. ఎంపీడీవో విజయ్‌భాస్కర్‌రెడ్డి, సర్పంచ్‌ రాజమణి, ఎంపీవో అనిల్‌ తదితరులు ఉన్నారు.

'ఇళ్ల ఎంపికలో అర్హులకు అన్యాయం'



అధికారులను నిలదీస్తున్న నాయకులు

ఖానాపూర్‌: అధికారుల నిర్లక్ష్యంతో పట్టణంలో రెండో విడతలో డబుల్‌బెడ్‌రూం ఇళ్ల ఎంపికలో అర్హులకు అన్యాయం జరిగిందని కాంగ్రెస్‌ పార్టీ మున్సిపల్‌ ఫ్లోర్‌లీడర్‌ చిన్నం సత్యం, బీజేపీ పట్టణాధ్యక్షుడు నాయిని సంతోష్‌ అన్నారు. మంగళవారం ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో లబ్ధిదారుల ఎంపికకు అధికారులు చేపట్టిన లక్కీడిప్‌ కార్యక్రమానికి హాజరై నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అధికారులను నిలదీశారు. లక్కీడిప్‌ నిర్వహించే అధికారులు లబ్ధిదారులతోపాటు స్థానిక కౌన్సిలర్లకు, మీడియాకు సమాచారం ఇవ్వకుండా ఇష్టారాజ్యంగా నిర్వహిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు తప్పుడు సర్వేలతో అనర్హులను ఎంపిక చేసి అర్హులకు అన్యాయం చేస్తున్నారన్నారు. ఇళ్లు రాని 160 మందికి ఇళ్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్‌ చేశారు. బాధితులకు న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తామని హెచ్చరించారు. దీనిపై కలెక్టర్‌కు సైతం ఫిర్యాదు చేస్తామని పేర్కొన్నారు.

మొలకెత్తని విత్తనాలు

- జిల్లాలో సగానికిపైగా నర్సరీల్లో ఇదే దుస్థితి
- నీళ్లు పట్టినా రాని మొలకలు
- హరితహారానికి మొక్కల కొరత ఏర్పడే అవకాశం



లోకేశ్వరం నర్సరీలో మొలకెత్తని విత్తన బెడ్‌లు

లోకేశ్వరం: హరితహారంలో భాగంగా నాటే మొక్కలను పెంచేందుకు ప్రభుత్వం గ్రామపంచాయతీకో నర్సరీ ఏర్పాటు చేసింది. గ్రామీణాభివృద్ధి శాఖ ఈ నర్సరీలను నిర్వహిస్తోంది. కానీ విత్తనలోపం కారణంగా జిల్లాలోని మెజార్టీ నర్సరీల్లో మొలకలు రాలేదు. దీంతో సగానికి పైగా నర్సరీల్లో మట్టి నింపిన పాలిథిన్‌ బ్యాగులే దర్శనమిస్తున్నాయి. ఇటీవల భైంసా, లోకేశ్వరం మండలాల్లోని నర్సరీలను కలెక్టర్‌ వరుణ్‌రెడ్డి పరిశీలించి అసంతృప్తి వ్యక్తం చేశారు. విత్తనాలు మొలకెత్తకపోవడంపై సంబంధిత అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అయితే ఇప్పటికీ నర్సరీలను చక్కదిద్దకుంటే హరితహారంలో భాగంగా మొక్కలు నాటేందుకు కొరత ఏర్పడే పరిస్థితి కనిస్తోంది.

జిల్లాలో 396 నర్సరీలు..

జిల్లాలో 396 నర్సరీలుండగా.. ఒక్కో నర్సరీలో 11వేల చొప్పున మొత్తం 43లక్షల 56 వేల మొక్కలను పెంచాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నారు. ఇందుకోసం గతేడాది డిసెంబరు నుంచే నర్సరీలను సిద్ధం చేశారు. కూలీలతో పాలిథీన్‌ బ్యాగులో మట్టి నింపి కానుగ, చింత, జామ, బొప్పాయి, తదితర రకాల విత్తనాలను వేశారు. అయితే పలు మండలాల్లో ఏర్పాటు చేసిన నర్సరీల్లో విత్తనాల లోపం కారణంగా ఎంత నీళ్లు పట్టినా మొలకెత్తలేదు. దీంతో సగానికి పైగా నర్సరీల్లో 60 శాతం మాత్రమే మొక్కల ఎదుగుదల కనిస్తోంది. అధికారులు చేసిన తప్పుకు లక్షల విత్తనాలు వృథా అయ్యాయి.

అధికారుల్లో ఆందోళన..

హరితహారం ప్రారంభించేందుకు మరో 15 రోజుల సమయం మాత్రమే ఉంది. విత్తనాలకు మొలకలు రాకపోవడం, పలుచోట్ల వచ్చినా అవి సక్రమంగా ఎదగకపోవడంతో అధికారులు ఆందోళన చెందుతున్నారు. సకాలంలో మొక్కలు అందించకపోతే ఇబ్బందుల్లో పడతామని భయపడుతున్నారు.

మళ్లీ విత్తనాలు..

ఈ నేపథ్యంలో జిల్లాలోని అన్ని నర్సరీల్లో మొక్కల పరిస్థితిపై అధికారులు ఆరా తీశారు. మొలకెత్తని విత్తనాల స్థానంలో దాదాపు రూ.లక్ష వరకు మళ్లీ కొత్త విత్తనాలు వేశారు. మునగ చెట్లను ఎక్కువ సంఖ్యలో పెంచాలని భావిస్తున్నారు. అయినప్పటికీ మొక్కలు సరిపోకపోతే పంచాయతీల ఆధ్వర్యంలో కొనుగోలు చేయించి తెప్పించాలని చూస్తున్నారు.

మళ్లీ విత్తనాలు వేశాం



జిల్లాలో కొన్ని నర్సరీల్లో మాత్రమే విత్తనాలు మొలకెత్తలేదు.అలాంటి వాటిని గుర్తించి అక్కడ కొత్త విత్తనాలు వేయించాం. మొక్కలు త్వరగా ఎదిగేలా నిత్యం నీళ్లు పట్టేలా చర్యలు చేపడుతున్నాం. హరితహారానికి మొక్కల కొరత రాకుండా చూస్తాం. త్వరలో జిల్లాలోని అన్ని గ్రామాల్లో మొక్కలు పంపిణీ చేస్తాం.

– విజయలక్ష్మి, నిర్మల్‌ డీఆర్డీవో

ఆర్థిక అక్షరాస్యతపై విద్యార్థులకు పోటీలు



భైంసాలో బహుమతి అందిస్తున్న ఎస్‌బీఐ మేనేజర్



మామడ: బహుమతితో కొరిటికల్‌ విద్యార్థులు

భైంసాటౌన్‌: ఆర్‌బీఐ సూచనల మేరకు ఎస్‌బీఐ భైంసాశాఖ ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యతపై నిర్వహించిన క్విజ్‌ పోటీల్లో పలువురు విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. భైంసాలోని బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో మంగళవారం పోటీలు నిర్వహించగా మండలంలోని ఆయా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. ఈ పోటీల్లో టీఎస్‌డబ్ల్యూఆర్‌జేసీ (భైంసా) బాసరకు చెందిన విద్యార్థిని బి.ప్రణయ, జె.అవంతిక మొదటి బహుమతి(రూ.5వేలు) గెలుచుకున్నారు. భైంసా మండలం తిమ్మాపూర్‌ జెడ్పీహెచ్‌ఎస్‌కు చెందిన సీహెచ్‌ అలేఖ్య, పి.రజిత ద్వితీయ బహుమతి(రూ.4వేలు), భైంసా మైనార్టీ పాఠశాలకు చెందిన షేక్‌ ఇమ్రాన్, మిర్జా అనాజ్‌బేగ్‌ తృతీయ బహుమతి (రూ.3వేలు) గెలుచుకున్నారు. ఎస్‌బీఐ భైంసాశాఖ మేనేజర్, ఆశ్రమ పాఠశాల హెచ్‌ఎం భోజారాం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మామడ: ఆర్‌బీఐ ఫైనాన్షియల్‌ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని జెడ్పీ సెకండరీ పాఠశాలలో విద్యార్థులకు ఆర్థిక అక్షరాస్యతపై మండలస్థాయి క్విజ్‌ పోటీలు నిర్వహించారు. మామడ, లక్ష్మణచాంద మండలాల్లోని పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. మహాత్మా జ్యోతిబాపూలే పాఠశాల విద్యార్థులు భూషన్‌రెడ్డి, హర్షవర్ధన్‌గౌడ్‌ ప్రథమ బహుమతి, కొరిటికల్‌ జెడ్పీ సెకండరీ పాఠశాల విద్యార్థులు శ్రీనిధి, సరిత ద్వితీయ బహుమతి, కేజీబీవీ విద్యార్థులు దీపిక, శ్రీజ తృతీయ బహుమతి సాధించగా వారికి ప్రశంసాపత్రం నగదు, బహుమతి అందించారు. కార్యక్రమంలో లక్ష్మణచాంద ఏడీసీసీ బ్యాంకు అధికారులు శిరీష్‌గౌడ్, అజయ్‌కుమార్, కుంటాల బ్యాంకు సీఎఫ్‌ఎల్‌ రాంసింగ్, రాజేందర్, ప్రధానోపాధ్యాయుడు నరసింహస్వామి, ఉపాధ్యాయులు శ్రీనివాస్, స్వామిరెడ్డి పాల్గొన్నారు.

ముధోల్‌: మండల కేంద్రంలో మంగళవారం విద్యార్థులకు ఆర్థిక అక్షరాస్యతపై మండల స్థాయి పోటీలు నిర్వహించారు. ఎస్‌బీఐ ముధోల్‌శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పరీక్షలో ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులను అందజేశారు. ప్రథమ స్థానంలో నిలిచిన ముధోల్‌ జెడ్పీఎస్‌ఎస్‌కు చెందిన ఆర్‌.గాయత్రి, పి.వినాయక్‌కు మేనేజర్‌ రూ.5వేలు అందించారు. ఉపాధ్యాయులు, సిబ్బంది ఉన్నారు.

కుంటాల: మండలంలోని కల్లూర్‌ ఉన్నత పాఠశాలలో ఆర్థిక అక్షరాస్యతపై మండలస్థాయి క్విజ్‌ పోటీలు నిర్వహించగా దిలావర్‌పూర్, కుంటాల మండలాల్లోని ఉన్నత పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. ఇందులో ఆదర్శ పాఠశాల విద్యార్థులు ప్రథమ స్థానంలో నిలువగా రూ.5వేలతోపాటు ప్రశంసాపత్రాలు అందించారు. ప్రిన్సిపాల్‌ శ్రీనివాస్‌ ప్రసాద్, శ్రీకాంత్‌ తదితరులు ఉన్నారు.

కడెం: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్‌ పాఠశాలలో విద్యార్థులకు ఆర్థిక అక్షరాస్యతపై క్విజ్‌ పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబర్చిన వారికి ఏడీసీసీ బ్యాంక్‌ మేనేజర్‌ రాజేశ్వర్‌రావు ప్రశంసా పత్రాలు అందజేశారు. హెచ్‌ఎం విజయస్వప్న ఉన్నారు.

తానూరు: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్‌ పాఠశాలలో ఆర్‌బీఐ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఆర్థిక అక్షరాస్యతపై క్విజ్‌ పోటీలను నిర్వహించారు. మండలంలోని తొమ్మిది జిల్లా పరిషత్‌ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. ప్రధానోపాధ్యాయులు సుభాష్‌ మోస్లే, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఆధ్వర్యంలో రక్తదానం



నిర్మల్‌లో రక్తదానం చేసిన వారికి పండ్లు ఇస్తున్న మేనేజర్‌ సాయన్న, తదితరులు

నిర్మల్‌టౌన్‌: ఆర్టీసీ ఎండీ సజ్జనార్‌ ఆదేశాల ప్రకారం జిల్లా కేంద్రంలోని డిపోలో మంగళవారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఇందులో 21 మంది ఆర్టీసీ ఉద్యోగులు రక్తదానం చేసి మానవత్వం చాటారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్‌ సాయన్న మాట్లాడుతూ చావు బతుకుల్లో ఉన్న వారి ప్రాణాలు కాపాడటం గొప్ప విషయమన్నారు. రక్తదానం చేసిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో ధనరాజ్, డాక్టర్‌ మాధవి, యూనియన్‌ బ్యాంక్‌ మేనేజర్‌ రాహుల్, హెచ్‌డీఎఫ్‌సీ మేనేజర్‌ చలపతి, డిపో అసిస్టెంట్‌ మేనేజర్‌ రాజశేఖర్‌ తదితరులు పాల్గొన్నారు.

ఏరియాస్పత్రిలో రక్తదానం

భైంసాటౌన్‌: పట్టణంలోని ఏరియాస్పత్రిలో మంగళవారం భైంసా ఆర్టీసీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఉద్యోగులు, బస్టాండ్‌లోని దుకాణ నిర్వాహకులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్‌ కాశీనాథ్, డీఎం అమృత, తదితరులు ఉన్నారు.

'బీజేపీ, బీఆర్‌ఎస్‌లది ఫెవికాల్‌ బంధం'



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీహరిరావు

నిర్మల్‌చైన్‌గేట్‌: బీజేపీ, బీఆర్‌ఎస్‌ పార్టీలది ఫెవికాల్‌ బంధమని.. ఆ పార్టీల నాయకులు రాష్ట్రంలో కుస్తీ పడుతూ ఢిల్లీలో దోస్తీ చేస్తున్నారని కాంగ్రెస్‌ నాయకులు శ్రీహరిరావు అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌ ఒకే కోవకు చెందినవని బీజేపీ నాయకులు మహేశ్వర్‌రెడ్డి విమర్శలు చేయడం మానుకోవాలని హితవు పలికారు. రాష్ట్రంలో కేసీఆర్‌తో కొట్లాడుతూ ఢిల్లీలో రిలేషన్‌ మెయింటెయిన్‌ చేస్తున్నారని ఆరోపించారు. గతంలో బీజేపీ ప్రవేశపెట్టిన బిల్లులకు బీఆర్‌ఎస్‌ మద్దతు ఇచ్చింది వాస్తవం కాదా అని ప్రశ్నించారు. మహారాష్ట్రలో కాంగ్రెస్, ఎన్సీపీ బలంగా ఉందని, బీజేపీకి లాభం చేకూర్చేందుకే సీఎం కేసీఆర్‌ మహారాష్ట్ర పర్యటన చేస్తున్నారని ఆరోపించారు. ఢిల్లీ లిక్కర్‌ స్కామ్‌ ఎందుకు నీరుగార్చారని ప్రశ్నించారు. కల్వకుంట్ల కుటుంబాన్ని జైలుకు పంపిస్తామని మాట్లాడిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌ ఎందుకు ఆలస్యం చేస్తున్నారని అన్నారు. రాష్ట్రంలో బీఆర్‌ఎస్‌కు ప్రత్యామ్నాయం కాంగ్రెస్‌ పార్టీ అని వచ్చే ఎన్నికల్లో అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. వారి వెంట పలువురు నాయకులు ఉన్నారు.

ఆయిల్‌పాం సాగుతో లాభాలు



మొక్క నాటుతున్న శ్యాంసుందర్, తదితరులు

లోకేశ్వరం: రైతులు ఆయిల్‌పాం సాగు చేసి లాభాలు పొందాలని జెడ్పీ మాజీ చైర్మన్‌ లోలం శ్యాంసుందర్‌ అన్నారు. మంగళవారం మండలంలోని నగర్‌లో ఆయిల్‌పాం మొక్కలు నాటారు. ఆయిల్‌పాంలో అంతర పంటలుగా సోయాబీన్, పెసర, కంది, పత్తి, నువ్వు, జొన్న, కూరగాయలను సాగు చేసుకోవచ్చని వారు పేర్కొన్నారు. ఉద్యానశాఖ అధికారి హర్షవర్ధన్‌రెడ్డి, పీఏసీఎస్‌ రత్నాకర్‌రావు, సర్పంచ్‌ నరేందర్‌రెడ్డి, క్లస్టర్‌ అధికారి శేఖర్‌ ఉన్నారు.

నర్సాపూర్‌(జి): మండలంలోని గొల్లమాడ గ్రామంలో పాపెన్‌ రాజేశ్వర్‌కు చెందిన నాలుగెకరాల్లో ఆయిల్‌పాం మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఏఈఓ గణేశ్, క్లస్టర్‌ అధికారి శ్రీనివాస్, లింగాల శ్రీనివాస్, ఎర్రన్న, చిన్నయ్య పాల్గొన్నారు.

నోట్‌బుక్‌లు పంపిణీ

దస్తురాబాద్‌: మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు ప్రధానోపాధ్యాయుడు వేణు మంగళవారం నోట్‌బుక్‌లు, పెన్నులు అందించారు. తహసీల్దార్‌ లక్ష్మి ప్రభుత్వ విద్యార్థులకు పాఠ్యపుస్తకాలను పంపిణీ చేశారు. సర్పంచ్‌ రాజమణి, ఎంపీడీవో విజయభాస్కర్‌రెడ్డి, ఎంపీవో అనిల్‌ తదితరులు పాల్గొన్నారు.

'ఇంటింటికీ బీజేపీ'

ఖానాపూర్‌: మండలంలోని బీర్నంది పంచాయతీలోని రంగపేట గ్రామంలో బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా కార్యదర్శి పెట్టెం చంద్రశేఖర్, బూత్‌ అధ్యక్షుడు మూతే శ్రీనివాస్‌తో కలిసి ఇంటింటికీ బీజేపీ కార్యక్రమం నిర్వహించారు. ప్రధాని పాలనకు మద్దతు తెలిపేందుకు 90909 02024 నెంబర్‌కు మిస్డ్‌ కాల్‌ ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు, తదితరులున్నారు.

మంత్రి, అప్పాల మధ్య చర్చలు

నిర్మల్‌: నిర్మల్‌ నియోజకవర్గంలో వరుసగా మూడోసారి గెలవడమే లక్ష్యంగా బీఆర్‌ఎస్‌ ప్రయత్నాలు ముమ్మరం చేస్తోంది. మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి రానున్న ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో పార్టీ బలోపేతం కోసం నిర్మల్‌ మాజీ మున్సిపల్‌ చైర్మన్‌ అప్పాల గణేష్‌ చక్రవర్తిని పార్టీలోకి ఆహ్వానించినట్లు తెలుస్తోంది. ఈమేరకు మంగళవారం రాత్రి హైదరాబాద్‌లోని ఓ హోటల్‌లో మంత్రి అల్లోల, అప్పాల గణేష్‌ చక్రవర్తి భేటీ అయ్యారు. నేడోరేపో గణేష్‌ చక్రవర్తి బీఆర్‌ఎస్‌లో చేరడం ఖాయమైనట్లు సమాచారం. మరోవైపు గణేష్‌ చక్రవర్తితో విభేదించే పార్టీ నాయకులతోనూ మంత్రి చర్చలు జరిపినట్లు తెలిసింది.

కేసు నమోదు చేయాలని వినతి

కుంటాల: మండలంలోని ఓలా గ్రామంలో ఈనెల 3న బడిబాటలో డీఈవో సమక్షంలో విద్యార్థుల చేత పాకిస్థాన్‌కు అనుకూలంగా నినాదాలు చేయించిన వారిపై దేశద్రోహం కేసు నమోదు చేయాలని బీజేపీ, హిందువాహిని సభ్యులు డిమాండ్‌ చేశారు. మంగళవారం కుంటాలలో ఎస్సై హన్మాండ్లుకు వినతి పత్రం అందజేశారు. ఎంపీపీ అప్క గజ్జారాంయాదవ్, బీజేపీ మండల కన్వీనర్‌ గుడ్డేటి నర్సయ్య, హిందు వాహిని మండల కన్వీనర్‌ దిగంబర్‌ పటేల్, ఎంపీటీసీ రవి, ప్రభాకర్‌ తదితరులు పాల్గొన్నారు.

'అసత్య ప్రచారం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి'

కుంటాల మండలంలోని ఓలాలో బడిబాటలో విద్యార్థుల వీడియోను మార్ఫింగ్‌ చేసి అసత్య ప్రచారం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని ఎంఈవో ముత్యం ప్రధానోపాధ్యాయుడు సునీల్‌రెడ్డి పోలీసులను కోరారు. ఈమేరకు మంగళవారం రాత్రి ఎస్సై హన్మాండ్లుకు వినతిపత్రం ఇచ్చారు.

'కంటివెలుగు' డబ్బులు ఇవ్వరా?

- వైద్యాధికారులను నిలదీసిన సర్పంచ్‌లు
- గంటలోనే ముగిసిన లోకేశ్వరం సర్వసభ్య సమావేశం



అధికారిని నిలదీస్తున్న సర్పంచ్‌ భుజంగ్‌రావు

లోకేశ్వరం: గ్రామాల్లో కంటివెలుగు శిబిరాల నిర్వహణ డబ్బులను ప్రభుత్వం వైద్యాధికారుల ఖాతాల్లో జమ చేసినా.. తమకు ఇవ్వడం లేదని అవర్గ సర్పంచ్, సర్పంచ్‌ల ఫోరం మండలాధ్యక్షుడు భుజంగ్‌రావు, రాజూర సర్పంచ్‌ ముత్తగౌడ్, కన్కపూర్‌ సర్పంచ్‌ నరేశ్‌ వాపోయారు. వెంటనే శిబిరాల నిర్వహణకు తాము ఖర్చు చేసిన సొమ్మును అప్పగించాలని అధికారులను నిలదీశారు. డబ్బులను త్వరలో అందేలా ఎంపీడీవో సోలమాన్‌రాజ్‌ చూస్తామనడంతో వారు శాంతించారు.

గంటలోనే ముగిసిన వైనం..

మండల పరిషత్‌ కార్యాలయంలో ఎంపీపీ బయాలలిత అధ్యక్షతన మంగళవారం లోకేశ్వరం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. మూడు నెలలకోసారి నిర్వహించే మండల సర్వసభ్య సమావేశం గంటలో ముగించారు. ఎంఈవో చంద్రకాంత్‌ మాట్లాడుతూ ఈసారి పదో తరగతి ఫలితాల్లో మండలంలో వంద శాతం ఉత్తీర్ణత నమోదైందన్నారు. ఇప్పటికే విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్‌లు అందించామన్నారు.

మండలంలో ఇటీవల 10 మందికి రైతుబీమా చెక్కులు అందించామని ఏవో గణేశ్‌ పేర్కొన్నారు.

లోకేశ్వరంలో శిథిలావస్థకు చేరిన స్తంభాల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయాలని ఎంపీటీసీ జయసాగర్‌రావు కోరారు. రాజూరలో సబ్‌స్టేషన్‌ పనులు నత్తనడకన సాగుతున్నాయని సర్పంచ్‌ ముత్తగౌడ్‌ తెలుపగా వేగవంతం చేస్తామని ఏఈ శివకుమార్‌ అన్నారు. పీఏసీఎస్‌ చైర్మన్‌ రత్నాకర్‌రావు, రఘు, శ్రీకాంత్, రఘువంశీ, ఏపీవో మల్లేశ్, ఏపీఎం జగన్నాథ్, పశు వైద్యాధికారి జెస్సీ తదితరులు ఉన్నారు.

ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

- భైంసా మండల సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ కల్పన

భైంసాటౌన్‌: మండలంలోని ఆయా గ్రామాల్లో నెలకొన్న ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు తమ వంతు బాధ్యతగా కృషి చేయాలని ఎంపీపీ కల్పనజాదవ్‌ అన్నారు. పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం భైంసా మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా శాఖల అధికారులు తమ ప్రగతి నివేదికలను వివరించగా.. సభ్యులు గ్రామాల్లో సమస్యలపై నిలదీశారు.

విద్యుత్‌ సమస్యలపై సిబ్బంది స్పందించడం లేదని, మిషన్‌ భగీరథ పైపులైన్‌కు లీకేజీలు ఏర్పడుతున్నాయని పలువురు సభ్యులు అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. చెరువులకు మరమ్మతుల నిధులు రావడం లేదని పేర్కొన్నారు. మరోవైపు సిద్దూర్‌ సర్పంచ్‌ మారుతి తనను సమావేశానికి ఆహ్వానించలేదంటూ కింద కూర్చుని ఎంపీడీవో తీరుపై నిరసన తెలిపారు. సమావేశంలో ఏఎంసీ చైర్మన్‌ రాజేశ్‌ బాబు, వైస్‌ ఎంపీపీ గంగాధర్, ఎంపీడీవో గోపాలకృష్ణారెడ్డి, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

సాదాసీదాగా సర్వసభ్య సమావేశం



మాట్లాడుతున్న ఎంపీపీ కొండ్ర రేఖ

నర్సాపూర్‌(జి): ప్రజాసమస్యలపై అధికారులు, స్పందించాలని ఎంపీపీ కొండ్ర రేఖ అన్నారు. మండల కేంద్రంలోని రైతువేదికలో మంగళవారం ఎంపీపీ అధ్యక్షతన నర్సాపూర్‌(జి) మండల సర్వసభ్య సమావేశం సాదాసీదాగా నిర్వహించారు. అధికారులు తమ నివేదికలను చదివి విన్పించారు.

ఎంఈవో శంకర్‌ మాట్లాడుతూ మండలంలోని పాఠశాలల్లో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్‌లు, యూనిఫాం పంపిణీ చేశామన్నారు.

ఏవో జాదవ్‌ సాయికిరణ్‌ మాట్లాడుతూ మండలంలో 7,511 మందికి దశలవారీగా రైతుబంధు డబ్బు జమవుతాయన్నారు. ఇటీవల ఆరుగురు రైతుల నామినీలకు రైతుబీమా చెక్కులు అందించామన్నారు. జీలుగ విత్తనాలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఐసీడీఎస్‌ సీడీపీఓ నాగమణి మాట్లాడుతూ 27 అంగన్‌వాడీ, 4 మినీ అంగన్‌వాడీ కేంద్రాల్లో 890 మంది చిన్నారులకు ప్రతినెలా బాలామృతం, 16 కోడిగుడ్లు అందిస్తున్నామని పేర్కొన్నారు. ఆరోగ్య లక్ష్మి ద్వారా 198 మంది గర్భిణులు, 182 మంది బాలింతలకు ఒకపూట సంపూర్ణ భోజనం, ఉడికించిన కోడిగుడ్డు, 200ఎంఎల్‌ పాలు అందిస్తున్నామని పేర్కొన్నారు. బీసీ కులవృత్తులకు అందించే రూ.లక్ష రుణసాయం కోసం మండలంలో 446 దరఖాస్తులు వచ్చాయని ఎంపీడీవో వనజ పేర్కొన్నారు. తురాటి సర్పంచ్‌ అశ్విని మాట్లాడుతూ గ్రామంలో లూజ్‌ వైర్లను సరిచేయాలని కోరగా ఏఈ శివప్రసాద్‌ సానుకూలంగా స్పందించారు.

పశువైద్యాధికారి గోవర్ధన్‌ మాట్లాడుతూ ముద్ర పథకం కింద పాడి రైతులకు గేదె కొనుగోలుకు రూ.లక్ష సాయం అందిస్తామన్నారు.

ఎంపీఓ శ్రీనివాస్‌గౌడ్‌ మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుధ్య పనుల పర్యవేక్షణ, తడి, పొడి చెత్త సేకరణ, సీజనల్‌ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ఉద్యానశాఖ అధికారి జావిద్‌పాషా, జెడ్పీటీసీ చిన్నరామయ్య, వైస్‌ ఎంపీపీ లక్ష్మి, ఎంపీటీసీ మల్లేశ్, తహసీల్దార్‌ శ్రీకాంత్, కోఆప్షన్‌ సభ్యుడు ఫసీ, సర్పంచ్‌లు రాంరెడ్డి, అశ్విని తదితరులు పాల్గొన్నారు.

'ఎంఐఎంను విమర్శించే స్థాయి లేదు'

భైంసాటౌన్‌: ఎంఐఎం పార్టీ, అధినేతను విమర్శించే స్థాయి బీజేపీ నాయకులు మహేశ్వర్‌రెడ్డికి లేదని భైంసా మున్సిపల్‌ వైస్‌చైర్మన్‌ ఎండీ జాబీర్‌ అహ్మద్‌ అన్నారు. మంగళవారం భైంసాలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్‌ పార్టీ నుంచి బీజేపీలో చేరిన మహేశ్వర్‌రెడ్డి తమ పార్టీపై అసత్య ఆరోపణలు చేస్తున్నారని పేర్కొన్నారు. కాంగ్రెస్‌లో ఉంటే ఎమ్మెల్యేగా గెలిచే అవకాశం ఉండేదని.. బీజేపీలో చేరిన ఆయన నిర్మల్‌లో ఎప్పటికీ ఎమ్మెల్యే కాలేరని జోస్యం చెప్పారు. అలాగే కాంగ్రెస్‌ నాయకులు సైతం మైనార్టీల ఓట్లు ఆకర్షించేలా ఎంఐఎం పార్టీపై విమర్శలు మానుకోవాలని హితవు పలికారు.

వర్షాకాలంలో అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న తానూరు ఎంపీడీవో శ్రీనివాస్‌రావ్‌

పెంబి: వర్షాకాలం నేపథ్యంలో సీజనల్‌ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని ఎంపీవో రత్నాకర్‌రావు అన్నారు. మండలంలోని రాయదారి, కోరకంటి, అంకెన, కర్ణంలొద్ది, పోచంపల్లి గ్రామాల్లో సీజనల్‌ వ్యాధులపై అవగాహన కల్పించారు. మురుగు కాలువల్లో నీరు నిల్వకుండా పూడిక తొలగించే చర్యలు చేపట్టాలని సిబ్బందికి సూచించారు. రోడ్లపై చెత్తాచెదారం లేకుండా చూసుకోవడంతోపాటు దోమల నివారణకు శానిటేషన్‌ చేయించాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు, కార్యదర్శులు ఉన్నారు.

తానూరు: వర్షాకాలంలో సీజనల్‌ వ్యాధుల బారిన పడకుండా గ్రామాల్లో ప్రజలకు పంచాయతీ అధికారులు అవగాహన కల్పించాలని ఎంపీడీవో శ్రీనివాస్‌రావ్‌ సూచించారు. మంగళవారం మండల పరిషత్‌ కార్యాలయంలో గ్రామాల పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష నిర్వహించారు. డెంగీ, మలేరియా తదితర వ్యాధుల బారిన పడకుండా పరిసరాల్లో పరిశుభ్రత పాటించడంతోపాటు మురికినీరు తొలగించాలన్నారు. గ్రామాల్లో హరితహారంలో భాగంగా మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టాలని సూచించారు. ఎంపీవో మోహన్‌సింగ్, ఈజీఎస్‌ ఏపీవో గంగాధర్, కార్యదర్శులు తదితరులు ఉన్నారు.

తపాలా సేవలు సద్వినియోగం చేసుకోవాలి

పెంబి: తపాలాశాఖ అందిస్తున్న బీమా, పొదుపు పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పోస్టల్‌ ఇన్‌స్పెక్టర్‌ జిల్లా అధికారి షఫీఉద్దీన్‌ అన్నారు. మంగళవారం మండలంలోని నాగాపూర్‌ గ్రామంలో తపాలా బీమా సేవలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పింఛన్‌దారులు ప్రతినెలా కొంత మొత్తం సేవింగ్, ఆర్‌డీ ఖాతాల్లో జమ చేసుకోవాలని సూచించారు. సర్పంచ్‌ సునీత శ్రీనివాస్, మేనేజర్‌ కల్యాణ్, బీపీఎం చంద్రశేఖర్, తదితరులు ఉన్నారు.